
# కొయ్యబొమ్మలు

తలారి లీలాలక్ష్మి



సన్నగా వాన పడుతూంది. రోహిణీకార్తె ఎండలకు ప్రసిద్ధి. కానీ ఈ సంవత్సరం అన్నీ విపరీతాలే కదా! అలాగే ఈ వాన లూనూ!

ప్రెసిడెంటు కామయ్య లంకాకు చుట్ట నోట్లో పెట్టుకుని, తన లంకంత యింటి వరండా మీద, పడక కుర్చీలో కూర్చుని యేదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. అసలు అతను మామూలుగా ఉన్నదెప్పుడు?

అవును మరి, అతని కది అవసరం. మామూలు పద్ధతిలో బ్రతికే మనకది అర్థం కాకపోయినా, కామయ్య లాంటి రాజకీయ నాయకుల కది తప్పనిది. పదవి సంపాదించే వరకు పడే తిప్పలు ఒక వంతయితే, దాన్ని చేపట్టిన క్షణంనుండి మళ్ళీ ఎన్నికల వరకు దాన్ని నిలబెట్టుకోవటాన్కి నిత్యం పడే పాట్లు మూడువంతులు. బట్ట కట్టడం దగ్గర్నించి, మాటల్లో బెట్టు చూపిం

చడం వరకూ, వారికీ, మామూలు ప్రజలకీ లెక్కలేనంత వ్యత్యాసం ఉంటుంది. ఒకప్పుడు వాళ్ళూ మనలాంటి వారే అయినా, వారు చేపట్టిన వృత్తి వారిలో ఆ మార్పుల్ని తీసికొని వస్తుంది. ఒక్కోసారి వారిని చూస్తూంటే మనకు అసూయ కూడా కల్గుతూ ఉంటుంది.

ఆ పంచాయితీలోని అయిదుగురు మెంబర్లూ ఒక్కొక్కరే వచ్చి కామయ్యగారింటికి చేరారు. గొడుగులు చూరుకి వేలాడదీసి, ప్రెసిడెంటుగారికి యెదురుగా సిద్ధంచేసి ఉంచబడ్డ ఆసనాల్లో కూచ్చున్నారు. విషయం యెలా కదలేయాలో వాళ్ళలో యెవ్వరికీ తెలియటం లేదు.

అదే మామూలు గ్రామీణులయితే, ఆ వాతావరణంలో, అకాలంగా కురుస్తున్న వర్షాల గురించి, దమ్ములు, ఊడ్పులు గురించి మాట్లాడుకుంటారు. కాని వీరంతా వేరే వృత్తికి చెందినవారు కదా! రాజకీయాల రుచి మరిగిన రాబందులు కష్టపడి వ్యవసాయం చేయగలవా?


కామయ్య లేచి లోపలికి వెళ్ళాడు.

'కరణంతో కబురు పంపినట్లుగా మాట నెరవేర్చుకుంటాడో లేదో' అని ఒకరంటే, 'ఇంకా తగ్గించమంటాడేమో?' నని ఒకరన్నారు. ఏమైనా మాటలు జరిగినట్లుగానే పనులు జరగాలి, లేకపోతే వీల్లేదనేసుకున్నారు. ఆయన వచ్చేసరికి యిలా గుసగుసలాడుకుంటూ కంటబడితే అంత బాగుండదని, అనుమానిస్తాడని అనుకుని, కిమ్మనకుండా కూర్చున్నారు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళు మునిగి తేల్తున్నారు.

పది నిముషాల్లో కామయ్య లోపల్నించి వచ్చాడు. అతని చేతిలో ఉన్న నోట్ల కట్టలు చూసి మెంబర్లందరికీ కళ్ళు వచ్చబడ్డాయ్. లోపల ఆశగా ఉన్నట్లు పైకి తేలిపోతే, లోకువైపోతాం అనుకొని కాబోలు, యెదురుగా కూర్చున్న వారంతా నేల చూపులు చూస్తున్నారు. ప్రెసిడెంటు నోట్లు లెక్కపెడుతున్నాడు. మొత్తాన్ని అయిదు కట్టలుగా చేసి తలొకటీ యిచ్చాడు. ఎవరి మటుకు వారు మళ్ళీ లెక్క చూసుకున్నారు. అందరూ బుర్ర ఊపారు, సరిపోయిందన్నట్లు.

"మీకు ముందు కబురుపంపిన బేరానికీ డబ్బు సరిపెట్టాను. మీ వార్డులలో మీరు ఎన్నికల్లో ఖర్చుపెట్టిన డబ్బు మీకు చేరినట్టే. ఇకపోతే ముందు జరుగబోయే లావాదేవీలలో మనం వేసుకోబోయే వాటాల సంగతి నిర్ణయించుకోవాలి. ఏమంటారు?" కామయ్య అందర్నీ కలిపి అడిగాడు.

"ముందు మాట్లాడుకోవడమే మంచిది గదండి. లేకపోతే, తర్వాత లాక్కోటం, పీక్కోటం యెవరికి మాత్రం యేం సర్దాగా ఉంటుందండి? మీరే ఒకమాట చెప్పండి. యెంచేతనంటే, మా కందరికీ డబ్బిచ్చి మమ్మల్ని కొనుక్కున్న మీకు ఆ మాత్రం ఆధిక్యత యివ్వటం మా కనీస ధర్మం" రెండో వార్డు మెంబరు కనకం యెంతో నమ్రతగా పలికాడు.




అది మనకి నమ్రతగా కనిపించవచ్చు, గాని, అది 'రాజకీయం' అన్న అనంతమైన విజ్ఞానశాస్త్రంలో ఒక ప్రాథమిక విషయం మాత్రమే. ముందు హాయిగా మాట్లాడుతూనే, వెనకాల గోతులు తీస్తూండే వాడే ఈ ఆధునిక రాజకీయంలో గెల్చుకు రాగలడు.

కనకం, ఆ మెంబర్లందరిలోనూ ఘటికుడు. అందుచేత మిగతా నలుగురూ అతనికా అధికారం యిచ్చేశారు. 'మా కంటే లౌక్యంగా మాట్లాడగలవు కాబట్టి కామయ్య దగ్గర, నువ్వు అన్నదానికి తల ఊపుతుంటాం; అంచేత నీకు బాగుందని తోచినట్లు సెటిల్ చెయ్' అని.

మొత్తం మీద కిందా మీదా పడి, అందరూ కల్సి ఒక నిర్ణయానికి వచ్చారు. 'ఎక్కువ ధనం ఖర్చు చేసినందుకు ప్రెసిడెంట్‌గార్కి సగభాగం, మిగిలిన సగం మెంబర్లందరికీ' అని తేల్చేశారు. అందరూ కల్సి కామయ్యని మోసం చేద్దామన్న ఉద్దేశ్యం అందులో యే ఒక్కరికీ లేదు. అంటే వారంత నిజాయితీ పరులనికాదు. కామయ్యకు టోపీ వేద్దామనుకుంటే, అసలు ప్రాణానికే మోసం అని వారికి బాగా తెల్సు. వందెకరాల భూకామందు కామయ్య, వెనక, కొన్ని అత్యవసర పరిసితులలో చేయించిన ఖూనీల గురించి లోకానికి కంతకీ తెల్సు. అయినా అతనిపై కేసు లేదు. క్షణానికో ఖూనీ చేయొచ్చు, కాని దాని తర్వాత చాలినంత డబ్బుండాలి, ఈ రోజుల్లో అంతే!


"నాకు మెంబరవటం యిదే మొదటి సారండి. నా వార్డులో రోడ్లు బాగా వేయిస్తానని ఎన్నికల ముందు మాటిచ్చాను. మన స్వలాభాల కోసం చూసుకుంటే రేపు వారు నన్ను నిలదీసి అడిగిననాడు నేనేం చేయాలి?" ఓ జూనియర్ మెంబర్ అనుమానాన్ని వెళ్ళగక్కాడు.

"ఓర్నీ తస్సాదియ్యా! యెంత పాటి ధర్మ సందేహమయ్యా నీకు? యిన్నేళ్ళ నించీ ఈ ప్రపంచంలో బ్రతుకుతున్నావ్ కదా, ఆ మాత్రం తెలుసుకోలేదా? యెవరైనా సహాయం కోసం వస్తే పెద్దోళ్ళు యేమంటారో తెలుసా? 'అలాగే, చూస్తాను, ప్రయత్నిస్తా' యిలాంటి పదాలే జవాబు యిస్తూంటారు. అదేవరస మనంకూడానూ. ఒకవేళ మరీ నిలదీసి అడిగితే, 'మిగతా వాళ్ళు ఒప్పుకోవటం లేదు, నా లోపం లేదు, నే నడిగాను' అని చెప్పేయ్. ఈ లోపులో వారికా ఓపికా నశిస్తుంది. మన పదవీకాలమూ గడిచిపోతుంది' ప్రక్కనున్న మెంబరు సమస్యను ఛేదించేశాడు. 'యెలావుంది ఉపాయం?' అన్నట్లు ఓసారి అందరివంకా చూశాడు.

"యేవయ్యోయ్, నువ్ రాజకీయాలకి కొత్త. మా వెనక నిల్చో చాలు. అయినా మీ వార్డులో వారికి రోడ్లు వేయించి, మా వార్డులో వాళ్ళకి బావులు త్రవ్విస్తే, చివరికి మన మాటేమిటి? యింతా గడ్డి కరచి సంపాదించిన పదవులెందుకు? నిజాయితీకి పోతే వచ్చే ఎలక్షన్లకి పెట్టుబడి ఎవడిస్తాడు మనకి?"యిలా కుదించి, తెగేసినట్లు మాట్లాడడంలో, కనకం నేర్పరి.

అంతవరకూ అందరి మాటలూ వింటూన్న కామయ్య కూడా సంభాషణలోకి దిగాడు. "మనం అందరం ఒక్కటి తెల్సుకోవాలి. అసలు మనం యెలా గెల్చాం?-- ఓట్లు డబ్బు తగలేసి. నిజాయితీ అంటూ, నిజంగా సేవచేద్దామని నిలబడ్డ నాంచారి బాబుకి డిపాజిట్టు కూడా పోయింది, మీకు తెల్సుగా! మనం అవసరమైనచోట ఖర్చు చేసి, అవకాశం చిక్కిన చోటల్లా దోచుకోవాలి. యిదే నేటి రాజకీయంలోని కిటుకు. మనం పంచిపెట్టిన డబ్బు తిన్న ఈ ప్రజలకి, 'ఈ పని మా కెందుకు చెయ్యలేదని' మనల్ని నిలదీసి అడిగేపాటి దమ్ములెక్కడ? యేనాడైతే వారి ఓటును మనకు అమ్మారో, ఆనాడే వారా హక్కును కోల్పోయారన్న మాట. వాళ్ళ అంతరాత్మలు బలహీనం అయిపోయాయ్. యిదే సరైన తరుణం మనకి!" శ్రద్ధగా ఆలకిస్తున్న అందరివైపూ కామయ్య అదోలా చూశాడు. తన మాటలు వారికి రుచిస్తున్నాయని గ్రహించి ఉపన్యాసంలో బిగిని పెంచాడు.

"అవకాశాలు అస్తమానూ రావు. వచ్చిన దాన్ని వదులుకోవటం అవివేకం. దీపం ఉండగానే యిల్లు చక్కబెట్టుకోవాలి యెవ్వరైనా. ఈ పదవి లేనినాడు మనల్ని చూసేవాడెవ్వడూ ఉండడు. మళ్ళీ పదవిలో ఉండాలన్నా, ఖర్చు చేసిన సొమ్ము, భర్తీ చేయాలన్నా, అవన్నీ ఈ కాలంలో చక్కబెట్టుకోవాల్సిన విషయాలే! అంటే డబ్బు సంపాదించుకోవాలన్న మాట. యిలా




యెన్నిసార్లు జరిగినా, రాబందులుగా రాణి స్తున్న వారికి మంచిదే. ప్రజల్లో యిప్పటికీ కాని రాజకీయ చైతన్యం త్వరలో వస్తుం దనిపించటంలేదు. మనకు కావల్సిందీ అదే కదా! అందుచేత యిదే ప్రజలు, ఈసారి మనం వారికేమీ చేయకపోయినప్పటికీ, వచ్చేసారి కూడా మనల్నే గెలిపిస్తారు. కాని అప్పటికి కావాల్సిన డబ్బును యిప్పట్నించీ సంపాదించుకోవడమే!'' కామయ్య మెంబర్ల నందరినీ చేతిలో పెట్టుకుని, గ్రామాన్ని దోచుకోవాలనుకుంటున్నాడు.

''కామయ్యగారు చెప్పిందాంట్లో యే మాత్రం అసత్యంలేదు. మనం నిజాయితీకి పోతే, రేపు మన పిల్లలు బజార్లంటా అడుక్కుతింటూ పోతారు. నిజాయితీకి గుర్తింపులేని ఈ లోకంలో బ్రతకటానికి యిదే సరైన మార్గం'' ప్రెసిడెంటుగారి ఉప న్యాసంలో రుచి కనిపించిన జూనియర్ మెంబర్ చాలామటుకు మారి పోయా డప్పుడే. అతనిలోని వేడి పొంగు కాస్తా చల్లబడిపోయింది.

''మరి మేం వస్తామండి'' అంటూ అందరూ రెండు చేతులూ జోడించి కామయ్య నుండి సెలవు తీసుకున్నారు.

''పిచ్చివాళ్ళు, వీళ్ళపై ఖర్చుపెడుతున్న దాన్కి మూడు రెట్లు పరిషత్తు ఎలక్షన్లలో నాకు గిడుతుందని వాళ్ళకేం తెలుసు. చవు కలో అమ్ముడు పోయారు.'' కామయ్య తన తెలివితేటలకి మురిసిపోయాడు.